
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పొలాల వద్దకే ట్రాన్స్‌ఫార్మర్లు

● మంత్రి సవిత



ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి

పెనుకొండ టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు కాళ్లరిగేలా తిరిగారనీ, కూటమి ప్రభుత్వం.. రైతుల పొలాల వద్దకే చేరవేస్తోందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన రైతులకు 75ట్రాన్స్‌ఫార్మర్లను ఆదివారం పెనుకొండ సబ్‌స్టేషన్‌లో అందించారు. అనంతరం మూతబడ్డ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాన్ని ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌తో కలిసి ప్రారంభించారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో ఆ పార్టీ సానుభూతిపరులకు మాత్రమే ట్రాన్స్‌ఫార్మర్లు దక్కేవన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పార్టీలు చూడకుండా ముందస్తు దరఖాస్తు చేసుకున్న వారికి అందిస్తున్నామన్నారు. త్వరలో మరో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 3వేల మందికి ట్రాన్స్‌ఫార్మర్లు అందించామన్నారు. వైజాగ్‌లో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుండడం శుభ పరిణామమన్నారు. ఎంతోమందికి ఉద్యోగావకాశాలు రానున్నాయన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖాధికారులు, మార్కెట్‌యార్డు చైర్మన్ రామకిష్టప్ప, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు పోతిరెడ్డి పాల్గొన్నారు.



హిందూపురంలోని ఎంజీఎం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద సందడి

నేడే దీపావళి

● కొనుగోళ్లతో జనం బిజీ

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చీకట్లను పారదోలి వెలుగులు నింపేది దీపావళి. అన్ని వయసుల వారికి ఇష్టమైన పండుగ దీపావళి గురువారం ఘనంగా చేసుకోనున్నారు. దీపాలు వెలిగించి, ఇంటిల్లిపాదీ టపాసులు కాల్చుతూ ఆనందంగా చేసుకోనున్నారు. ఆదివారం టపాసులు, పూజాసామగ్రి కొనుగోళ్లలో జనం బిజీగా కనిపించారు. ప్రశాంతి నిలయంలో పూర్వ విద్యార్థులు సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదివారం రాత్రి నుంచి జిల్లాలో బాణసంచా మోతలు మొదలయ్యాయి.

మంత్రులు, కలెక్టర్ శుభాకాంక్షలు

వెలుగుల పండుగ దీపావళి సందర్భంగా జిల్లా ప్రజలకు మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ శ్యాంప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. పర్వదినాన్ని సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

పీఈటీలకు సన్మానం



పీఈటీలను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తచెరువు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులుగా నియమితులైన 57 మందిని ఆదివారం ఏపీపీఈటీ, ఎస్ఏపీడీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వారిని అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు అంజన్న, ప్రధానకార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు నాగేంద్రప్రసాద్, హరిప్రసాద్, పాఠశాల హెచ్ఎం గోపాల్ పాల్గొన్నారు.

జీఎస్టీ తుస్..!

టపాసుల విక్రయాల్లో ఇష్టారాజ్యం

రూ.3.50కోట్లు ఎగవేసిన ఇద్దరు వ్యాపారులు

హోల్‌సేల్, రీటైలర్లూ వీరే..

ఉమ్మడి జిల్లాలో 555 దుకాణాలు

అధికారులకు భారీగా ముడుపులు

7

కొండ చిలువ పట్టివేత

తాడిమర్రి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కునుకుంట్ల గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి తోటలో కొండ చిలువను ఆదివారం దాడితోట ఫారెస్టు బీట్ ఆఫీసర్ వెంకటరమణ చాకచక్యంగా పట్టుకున్నారు. తోటలో కొండచిలువ ఉన్నట్టు రైతు సమాచారం ఇవ్వగానే.. ఫారెస్టు అధికారి తోట వద్దకు చేరుకున్నారు. కొండచిలువను పట్టి, బుక్కపట్నం అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.



కొండ చిలువను సంచిలోకి వేస్తున్న దృశ్యం

ఆరిపోయిన దీపాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి..

7

నీటి బెంగ లేదిక..!

● హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాల తరలింపు

● కదిరి నియోజకవర్గంలో నిండుతున్న 33 చెరువులు ● సాగులోకి వేల ఎకరాల ఆయకట్టు (6లో...)



మరువ పారుతున్న తలుపుల మండలంలోని కొండారెడ్డి చెరువు

రేపట్నుంచి పోలీసు అమరవీరుల

వారోత్సవాలు

● ఎస్పీ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఈనెల 21 నుంచి వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. పది రోజులపాటు కొనసాగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లోని తన కార్యాలయంలో ఎస్పీ ఆదివారం మాట్లాడుతూ.. వారోత్సవాల్లో భాగంగా 21న అమరవీరుల సంస్మరణ దినం, స్మృతి పరేడ్, పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి, 22 నుంచి 30వ తేదీ వరకు పోలీసు అమరవీరుల గ్రామాలు, పట్టణాల సందర్శన, అమరుల ఫొటోలు పాఠశాలల్లో ఉంచి.. అవగాహన కల్పించడం, చర్చావేదికలు, స్త్రీలు, చిన్నపిల్లలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడంపై వక్తృత్వ పోటీలు, పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శన, పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలను ప్రదర్శించి విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పించుట, 28న వైద్య, రక్తదాన శిబిరాలు, వాయుద్యాల ప్రదర్శన, 29న పోలీసుల త్యాగాలపై సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, 30న పోలీసు అమరవీరుల కుటుంబాల్లోని ప్రత్యేక సాధకులను గుర్తించి సన్మానాలు, 31న ఉదయం యూనిటీ రన్, సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీతో వారోత్సవాలు ముగుస్తాయని ఎస్పీ వివరించారు.

పుట్టపర్తి మునిసిపాలిటి, శ్రీ సత్యసాయి జిల్లా.

తేదీ 27-03-2025న వాయిదా పడిన పుట్టపర్తి పురపాలక సంఘ పరిధిలోని ఎనుములపల్లి చేపల చేరువు, సాహెబ్ చేపల చెరువులకు మరియు మరుగు దొడ్లలకు సంబంధించి 2025-2026 ఆర్థిక సంవత్సరమునకు గాను కౌన్సిల్ తీర్మానం నెం.574, తేది: 15.02.2025 మరియు బిల్ గెజిట్ నెం. SSS D.No.07/2025 మేరకు చేపల చెరువులు మరియు మరుగు దొడ్ల లీజుకు ఇచ్చుటకు బహిరంగ వేలం నిర్వహించుటకు తేది:22.10.2025 ను ఖరారు చేయుటకు మరియు పత్రికా ప్రకటన ఇచ్చుటకు E/A వారి ఆమోదము కొరతు చేపల చెరువులు మరియు మరుగు దొడ్ల వివరములు ఈ దిగువ కనపరచిన విధముగ

వరుస సంఖ్య	గుత్తల వివరములు	గుత్తికాలము	సవాలులో పాల్గొనుటకు కట్టవలసిన ధరావత్తు మొత్తము రూ.//	పొందుపరచవలసిన సాల్వేన్స్ సర్టిఫికేట్ మొత్తము రూ.//
1	సాహెబ్ చేపల చెరువు చేపలు పట్టుకొనుటకు హక్కు	2025-26 01.11.2025 నుండి 31.03.2026	Rs.1,50,000/-	Rs.3,00,000/-
2	ఎనుములపల్లి చేపల చెరువు చేపలు పట్టుకొనుటకు హక్కు	2025-26 01.11.2025 నుండి 31.03.2026	Rs.1,50,000/-	Rs.3,00,000/-
3	పుట్టపర్తి పురపాలక పరిధిలో గల మరుగు దొడ్ల నిర్వహణ హక్కు కొరకు	2025-26 01.11.2025 నుండి 31.03.2026	Rs.20,000/-	Rs.1,00,000/-

పై తెలిపిన విధముగా పుట్టపర్తి పురపాలక సంఘ కార్యాలయం నందు 22.10.2025 సమయము ఉదయం 11:00 గంటలకు కమీషనర్ గారి చేత చేపల చెరువు బహిరంగ వేలము నిర్వహించబడును.

కమీషనరు, పుట్టపర్తి మునిసిపాలిటి, శ్రీ సత్యసాయి జిల్లా.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

డీఏ ప్రకటన హర్షణీయం

● ఏపీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్

పుట్టపర్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు దీపావళి కానుగా నవంబరు నుంచి ఒక డీఏను విడుదల చేయడం హర్షణీయమని ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు లింగా రామ్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి హనుమాన్ సర్కిల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగులకు డీఏ ప్రకటించడం సంతోషదాయకం అన్నారు. హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ విధానం, ఆర్టీసీలో ఉద్యోగోన్నతులు తదితర అంశాలపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రివర్గ ఉపసంఘంతో స్నేహపూర్వకమైన వాతావరణంలో, గౌరవప్రదంగా చర్చలు జరిగాయని, ఐదు సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో జరగడం సంతోషదాయకం అన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేంద్ర, శంకర్, సూరి, మురళి, నాగభూషణం, రమాదేవి, పరిమి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



సురువు వరలక్ష్మీ సరోజమ్మ (ఫైల్)

ధర్మవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదానగర్‌కు చెందిన సురువు వరలక్ష్మీ సరోజమ్మ(50) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విశ్వదీపా సేవాసంఘం సభ్యులు మృతురాలి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారం మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రెడ్ క్రాస్ సొసైటీ డీఫై కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ సహకారంతో టెక్నీషియన్ రాఘవేంద్ర, విశ్రాంత కంటి వైద్యనిపుణుడు నరసింహులు కంటి కార్నియా సేకరించారు. కార్యక్రమంలో సంస్థ ముఖ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సురేష్, రఘు తదితరరులు పాల్గొన్నారు.

తల్లి హత్య కేసులో కొడుకు, కోడలు అరెస్ట్

కదిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తల్లి హత్య కేసులో కుమారుడు, కోడలిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 12వ తేదీన పట్టణంలోని నిజాంవలీ కాలనీ జెండామాను వీధిలో ఉండే ఖాసీంబీ అలియాస్ షాదాబీ (65) ని హత్య చేశారు. ఈ కేసులో ఆమె కుమారుడు అల్లాబకాష్, అతడి రెండో భార్య షేక్ రసూల్‌బీని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి ఆదివారం వెల్లడించారు. ఖాసీంబీని ఆస్తి కోసం కట్టె, కత్తితో కొట్టి హత్య చేశారని తెలిపారు. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, ఇంటి పత్రాలు తీసుకొని పారిపోయారని వివరించారు. ఆదివారం కుటాగుళ్ల రైల్వే గేటు సమీపంలో అల్లాబకాష్, రసూల్‌బీని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులను ధర్మవరం కోర్టులో హాజరు పరచగా.. వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

ఉపాధ్యాయులకు అవార్డులు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చేమియాపల్లి, మిట్టపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గౌస్‌లాజం, షేక్ షర్ఫుద్దీన్ సేవా పురస్కారాలు అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం క్యాంపెయిన్ షిప్ సంస్థ ఆధ్వర్యంలో అవార్డులను ప్రకటించారు. ఆ సంస్థ అధ్యక్షులు షబ్బీర్, రాష్ట్ర మైనార్టీ శాఖామంత్రి ఫారూఖ్, జనార్దన్, టీడీపీ పొలిటికల్ సభ్యుడు నాసిర్ అహ్మద్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాసిర్ అహ్మద్, మాజీ చీఫ్ సెక్రటరీ ఇంతియాజ్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

నీటి బెంగ లేదిక..!

హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాల తరలింపు

- కదిరి నియోజకవర్గంలో నిండుతున్న 33 చెరువులు
- సాగులోకి వేల ఎకరాల ఆయకట్టు
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు, రైతులు



హంద్రీనీవా నీటితో నిండి మరువపోతున్న కొండారెడ్డి చెరువు



నిండిన పూలకుంట పల్లి చెరువు

కదిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు కదిరి నియోజకవర్గంలోని 33 చెరువులను చేరాయి. దీంతో సాగు, తాగు నీటి సమస్యలు తీరనున్నాయి. గాండ్లపెంట మండలానికి కూడా త్వరలోనే హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు చేరనున్నాయి. నీటి తరలింపు పనులకు ఇప్పటికే రూ.46 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలో టెండర్లు పిలిచి, పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. నల్లచెరువు మండలం నుంచి గాండ్లపెంట మండలం మలమీదపల్లి వరకు లిఫ్ట్ ద్వారా నీటిని పంపుతారు. ఆ తరువాత నల్లచెరువు, గాండ్లపెంట, నంబులపూలకుంట మండలాల్లో దాదాపు 25 చెరువులకు నీళ్ల అందుతాయని అధికార్లు చెబుతున్నారు. నియోజవర్గంలో ఎప్పుడు తాగు, సాగు నీటి కొరత ఉండేది. ప్రస్తుతం హంద్రీనీవా నీటితో ఆ కొరత తీరనుంది. వేలాది ఎకరాల బీళ్ల సాగులోకి రానున్నాయి.

హంద్రీనీవా నీటితో నిండుతున్న చెరువులు

హంద్రీనీవా ద్వారా నియోజవర్గంలో 33 చెరువులకు కృష్ణా జలాలు చేరుతున్నాయి. ప్రస్తుతం 22 చెరువులు పూర్తిగా నిండి, మరువ పారుతున్నాయి. పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా హంద్రీనీవా నీరు తిరుపతి జిల్లా కుప్పం వరకు వెళుతున్నాయి. మధ్యలో ఉన్న కదిరి నియోజవర్గానికి ఇది ఎంతో కలిసి వచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత హంద్రీనావా కాలువకు లైనింగ్ పనులు చేశారు. దీంతో నీటి ప్రవాహ వేగం పెరిగింది. నియోజవర్గంలో కదిరి, నల్లచెరువు, తనకల్లు, తలుపుల మండలాల్లోకి చెరువులకు నీరందుతోంది. తలుపుల మండలంలో ఉన్న కొండారెడ్డి చెరువు కొన్ని దశాబ్దాలుగా నిండలేదు. అయితే ఈసంవత్సరం పూర్తిగా చెరువు నిండిపోయింది. పెద్దచెరువు, పులిగిండ్లపల్లి చెరువు నిండనున్నాయి.

సాగులోకి ఆయకట్టు

కృష్ణా జలాలతో నియోజకవర్గంలోని చెరువులు నిండుతుండటంతో వేలాది ఎకరాల ఆయకట్టు భూములు సాగులోకి రానున్నాయి. 33 చెరువుల కింద దాదాపు 15 వందల ఎకరాలకు పైగా ఆయకట్టు భూమి ఉంది. చెరువులు పూర్తి స్థాయిలో నిండటంతో చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందనున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. కదిరి ప్రాంతంలో రబీలో సాగు కేవలం బోర్లకిందే ఉండేది. చెరువుల కింద సాగు బాగా వర్షాలు పడినప్పుడు మాత్రమే ఉండేది. ప్రస్తుతం హంద్రీనీవా నీటితో చెరువులు నిండటం వల్ల రబీ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. కూలీలకు కూడా చేతినిండా పని దొరకనుంది.

పెరగనున్న భూగర్భ జలాలు

కృష్ణా జలాలతో చెరువులు నిండటం వల్ల భూగర్భ జలాలు పెరిగాయి. ఆయా చెరువుల సమీపంలోని బోర్లు, బావులు రీచార్జ్ అవుతున్నాయి. వీటి ద్వారా రెండు వేల ఎకరాల వరకు సాగు పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ వరకు ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే నాణ్యమైన విద్యుత్ సౌకర్యం ఉండటంతో రైతులు ప్రయోగాత్మకంగా పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు.

దశాబ్దాల కల నెరవేర్చాం: కందికుంట వెంకటప్రసాద్, ఎమ్మెల్యే



కరువుకు మారుపేరుగా ఉన్న కదిరికి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు తరలిస్తున్నాం. ఇది నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల. అది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి చొరవతో సాకారం అయ్యింది. నియోజకవర్గంలోని 33 చెరువులకు నీళ్లు ఇస్తున్నాం. గాండ్లపెంట, ఇతర మండలాలకు నీళ్లు అందిస్తాం. తలుపుల మండలం కొండారెడ్డి చెరువుకు నీళ్లు ఇచ్చాం. నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చేస్తాం. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఈప్రాంత ప్రజల తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యం.

తాగునీటి సమస్య తీరింది



నల్లచెరువు మండలం కె.పూలకుంట చెరువు నింపడం ద్వారా నాకు ఉన్న అర ఎకరా సాగులోకి వస్తోంది. మిగిలిన ఆయకట్టు రైతులు కూడా తమ పొలాలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. తాగునీటి సమస్య కూడా తీరిపోయింది. నీరులేక ఎండిపోయిన బోరుబావుల్లో మళ్లీ నీళ్లు కనిపిస్తున్నాయి. చెరువులు నింపడానికి కృషి చేసిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కి రుణపడి ఉంటాం.

-ఆనంద్, దామవాండ్లపల్లి, నల్లచెరువు మండలం

తారాజువ్వలు..!

● చుక్కల్లో టపాసుల ధరలు ● ప్రజల జేబులకు చిల్లు



హిందూపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ అంటేనే గుర్తొచ్చేది టపాసులు. వాటిని కాల్చుదామంటే ధరలు చూసి జనం బెంబేలెత్తుతున్నారు. దీపావళి పండగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటయ్యాయి. దుకాణాల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అదేస్థాయిలో ఈయేడాది ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఫ్యామిలీప్యాక్ ఒక్కటి గతేడాది రూ.300ఉండగా ఈసారి రూ.500కు విక్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వస్తువుల జాబితాలో బాణసంచా లేదు. దీంతో జీఎస్టీ 18శాతం కొనసాగుతోంది. ఈసారి పెంచి అమ్ముతుండడంతో ప్రజలు వాపోతున్నారు.

ధరల మోత

ధరలు పెరిగినా కొనుగోళ్లు ఏమాత్రం తగ్గట్లేదు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు మాత్రం ధరలతో బెంబేలెత్తుతున్నారు. కాకరపువ్వులు సాధారణంగా రూ.150, కలర్స్ అ యితే రూ.200, భూచక్రాల సైజు కంపెనీలను బట్టి రూ.50నుంచి రూ.200కు పలుకుతోంది. ఫ్యామిలీ బాక్స్ రూ.400నుంచి రూ.3500వరకు విక్రయిస్తున్నారు. చిచ్చరబుట్లు, మట్టితో చేసినవి రూ.30, కంపెనీవైతే రూ.250దాకా పలుకుతున్నాయి.

పెరిగిన షాపులు

దీపావళిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా 135 తాత్కాలిక టపాసుల దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. హిందూపురంలో అత్యధికంగా 40 షాపులకు అనుమతిచ్చారు. గతేడాది 20దాకా ఏర్పాటు చేయగా.. ఈసారి 40కి పెరిగాయి. గతేడాది వ్యాపారాలు బాగా జరగడంతో ఈసారి పోటీపడి ఏర్పాటు చేసుకున్నారు. రూ30వేలు ముందస్తు చలానా తీయాలని చెప్పినా తగ్గకుండా షాపులకు అనుమతి తీసుకున్నారు. ఒక్కో షాపులో కనీసం రూ.10లక్షల నుంచి రూ.20లక్షలదాకా సరుకు తీసుకొచ్చారు. కొన్ని షాపుల్లో రూ.50లక్షలదాకా సరుకు డంప్ చేసుకున్నారు. ఈసారి దీపావళి పండగకు రూ.10కోట్లకుపైగా టపాసులను దిగుమతి చేసుకున్నట్లు తెలుస్తోంది. జీఎస్టీ మాత్రం.. బిల్లులో 10 నుంచి 20శాతమే చెల్లించారు.

వైసీపీ నేతలను కాలర్ పట్టి నిలదీయండి

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


లబ్ధిదారులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంక్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నోరు ఉంది కదా అని ఇష్టమొచ్చినట్టు అసత్యప్రచారాలు చేసే వైసీపీ నాయకులను కాలర్ పట్టుకుని నిలదీయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. నియోజకవర్గ పరిధిలోని 64 మంది లబ్ధిదారులకు రూ.31 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో ఇప్పటి వరకూ 870 మంది సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా....595 మంది లబ్ధిదారులకు ఊరట లభించిందని, 16 విడతల్లో రూ. 5.50 కోట్లు మంజూరయిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం కోటి రూపాయలు కూడా మంజూరు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. సీఎం చంద్రబాబు డబ్బు గురించి ఆలోచించకుండా ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, వైసీపీ నేతలు ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే.. టీడీపీ నాయకులు వాళ్లకు దీటుగా సమాధానం ఇవ్వాలని అన్నారు. నోరుంది కదా అని ఏది మాట్లాడినా చెల్లుతుందనుకుంటే.. తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రకాష్‌రెడ్డి సోదరులు ఐదేళ్లు దోపిడీ చేసిన డబ్బుతో హైదారాబాద్, బెంగళూరులో ఆస్తులు పోగేసి, ఇప్పుడు బీద అరుపులు అరుస్తున్నారంటూ ఆమె మండి పడ్డారు.

బస్టాండులో రూ.4 లక్షలు చోరీ

తాడిపత్రి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు దిగి బయటకు వస్తున్న సమయంలో మహిళ బ్యాగు నుంచి రూ.4 లక్షలు గుర్తుతెలియని దుండగులు అపహరించిన సంఘటన స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురానికి చెందిన విజయలక్ష్మి బుక్కరాయసముద్రం మండలంలో వైద్యఆరోగ్య శాఖలో పనిచేస్తున్నారు. ఆమె తాడిపత్రిలో ఉన్న నాగరత్నమ్మతో రూ.4లక్షలు అప్పు తీసుకున్నారు. ఆ అప్పును చెల్లించడానికి డబ్బులు తీసుకొని బస్సు దిగి చేనేత కాలనీలో నివాసం ఉంటున్న నాగరత్నమ్మ ఇంటివద్దకు వెళ్లాలని బయటకు వెళుతున్న సమయంలో.. గుర్తుతెలియని మహిళ, పురుషుడు విజయలక్ష్మి భుజా న వేసుకున్న బ్యాగును బ్లేడ్‌తో కోసి తీసుకుని పరారయ్యారు. ఈ క్రమంలో ఆమె చేతికి కూడా గాయాలయ్యాయి. గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. బాధితురాలు వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చే శారు. రంగంలోకి దిగిన పోలీసులు బస్టాండ్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

జీఎస్టీ తుస్..!

టపాసుల విక్రయాల్లో ఇష్టారాజ్యం

రూ.3.50 కోట్లు ఎగవేసిన ఇద్దరు వ్యాపారులు

హోల్‌సేల్, రీటైలర్లూ వీరే..

ఉమ్మడి జిల్లాలో 555 దుకాణాలు

అధికారులకు భారీగా ముడుపులు



అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టపాసుల విక్రయాల ముసుగులో మరోసారి దోపిడీకి రంగం సిద్ధమైంది. ఇద్దరు కీలక వ్యాపారుల నుంచి రూ.కోట్లలో చిన్న వ్యాపారులకు విక్రయాలు జరిగాయి. ఈ క్రమంలో వ్యాపారుల నుంచి అధికారుల వరకు ఎవరి స్థాయిలో వారు వసూళ్లకు తెరలేపారు. వందల సంఖ్యలో తాత్కాలిక టపాసు దుకాణాలు ఏర్పాటు చేశారు. అనధికారికంగా మరికొన్ని దుకాణాలు వెలిశాయి. పెద్ద మొత్తంలో జీఎస్టీ ఎగవేస్తున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. కొందరికి గిఫ్ట్ బాక్స్‌లు కూడా పెద్ద మొత్తంలో వెళ్లాయి. జిల్లా కేంద్రమైన అనంతపురంలో అసోసియేషన్ ముసుగులో ఓ చోటా నాయకుడు వసూళ్ల పర్వం మొదలు పెట్టాడు.

రూ.3.50 కోట్లు ఎగవేత

ఉమ్మడి జిల్లాలో ఇద్దరు కీలక వ్యాపారులు ఉన్నారు. ఈ ఇద్దరూ టపాసుల వ్యాపారంలో ఆరితేరారు. ఇద్దరికీ మ్యాగజైన్‌లు ఉన్నాయి. టపాసుల శాశ్వతకాలం విక్రయాలు జరిపే హక్కు ఉన్న వారికి మ్యాగజైన్ ఉంటుంది. పెద్ద గోడౌన్‌లో ఉంచి వాటిని విక్రయిస్తుంటారు. గుంతకల్లులో ట్రేడర్స్ పేరుతో ఒకరు, శింగనమల మండలంలో మరొకరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యధిక శాతం వ్యాపారులకు వీరిద్దరి నుంచే టపాసులు వెళ్తాయి. ఒక్కొక్కరు రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు టపాసులు కొనుగోలు చేశారని తెలిసింది. అనంతపురం డివిజన్ పరిధిలో అత్యధికంగా 230 వరకు దుకాణాలు ఏర్పాటు చేశారు. కళ్యాణదుర్గం డివిజన్‌లో 60, గుంతకల్లు డివిజన్‌లో 50, కదిరిలో 70, హిందూపురంలో 90, ధర్మవరం డివిజన్‌లో 55 దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 555 వరకు ఏర్పాటు చేశారు. వీరిలో కనీసం 400 దుకాణాల వరకు వీరిద్దరి నుంచే కొనుగోలు చేసి ఉంటారని అంచనా. రూ.3లక్షల నుంచి రూ.10లక్షల వరకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. సగటున రూ.5లక్షల చొప్పున 400 దుకాణాలకు లెక్కేస్తే రూ.20కోట్ల వరకు దీపావళి సందర్భంగానే విక్రయాలు జరిపి ఉంటారు. టపాసులకు 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. అంటే రూ.3.60 కోట్లు చెల్లించాలి. కానీ పన్నుల శాఖకు చాలా తక్కువ స్థాయిలో పన్ను చెల్లిస్తారనే ఆరోపణలు వీరిపై ఉన్నాయి.

రీటైల్ వ్యాపారం కూడా..

మ్యాగజైన్‌లు స్థాయిలో వ్యాపారాలు నిర్వహించే వీరు హోల్‌సేలూ, రీటైలర్ అవతారం కూడా ఎత్తుతారు. ఓ ట్రేడర్స్ నేరుగా తాత్కాలిక వ్యాపారులతో విక్రయించడంతోపాటు దీపావళి సందర్భంగా ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేస్తారు. ఇక ఏడాది పొడవునా పెళ్లిళ్లు, ఇతర వేడుకలకు రీటైల్‌గా విక్రయిస్తారు. మరో కీలక వ్యాపారి నగర పరిధిలో ప్రత్యేకంగా కౌంటరు ఓపెన్ చేస్తారు. ఇక్కడే రీటైల్‌గా రూ.50లక్షల వరకు విక్రయిస్తారని సమాచారం. ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో రూ.కోట్లలో ఎగవేస్తుంటే పన్నుల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి. వారికి ముడుపులు ముట్టాయనే ఆరోపణలున్నాయి.

మారుతి బ్రాండ్ కార్లను ప్రోత్సహించాలి

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

'అనంత' అభిమానాన్ని మరువలేను: సినీనటి మీనాక్షి చౌదరి

నగరంలో సందడి


మాట్లాడుతున్న మీనాక్షి చౌదరి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


ఆటోమొబైల్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మీనాక్షిచౌదరి

అనంతపురం టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మారుతి సుజుకి బ్రాండ్ కార్లను అనంత వాసులు మరింతగా ప్రోత్సహించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అనంతపురం నగర శివారులోని శిల్పారామం వద్ద ఆదివారం నివ్య ఆటో మొబైల్స్ షోరూమ్ ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీతోపాటు సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్‌చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ.. భారతీయ బ్రాండ్‌కు సంబంధించిన మారుతి సుజుకి నూతన షోరూమ్‌ను అనంతపురం నగరంలో ప్రారంభించడం శుభపరిణామం అన్నారు. వ్యాపార రంగంలోనూ నగరం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. అనంతరం సినీ నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ... మారుతి సుజుకి మంచి ప్రీమియం బ్రాండ్ అని, తమ కుటుంబం కూడా మొదటి నుంచి మారుతి కార్లనే వినియోగిస్తోందని తెలిపారు. అనంతపురానికి తాను రావడం మొదటిసారి అని, ఇక్కడ సినీ ప్రేమికులు ఎక్కువగా ఉన్నారన్నారని అన్నారు. ఇంతటి సినీ ప్రేమికుల మధ్య నివ్య ఆటో మొబైల్స్‌ను ప్రారంభించే అవకాశం తనకు దక్కడం గర్వంగా ఉందన్నారు. నివ్య ఆటో మొబైల్స్ యజమాని మల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ... తాను అనంతపురం జిల్లా అల్లుడినేనని, గతంలోనూ ఇక్కడ ఆటో మొబైల్ బిజినెస్ చేశానని.. ఇపుడు నూతనంగా నివ్య ఆటోమొబైల్ షోరూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సేల్స్, సర్వీస్, స్పేర్‌పార్ట్స్ అన్నీ ఒకేచోట లభిస్తాయని పేర్కొన్నారు. జిల్లా వాసులకు ఉత్తమ సర్వీస్ అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మారుతి సుజుకి బ్రాండ్‌కు చెందిన మిడ్ ఎస్‌యూవీ విక్టోరిస్ కారును ఆవిష్కరించారు. అలాగే జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తదనంతరం షోరూమ్ వెలుపల సినిమా పాటలకు నృత్యం చేస్తూ నటి మీనాక్షి చౌదరి అభిమానులను ఉర్రూతలూగించారు. ఆమె రాకతో నగరంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మల్లు నివేదితారెడ్డి, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

మతి భ్రమించిందా.. శ్రీధర్ రెడ్డీ..!

పల్లె ఆగ్రహం



పుట్టపర్తిరూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర పురోభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అవాకులు.. చెవాకులు.. పేలుతున్నావు.. మతిభ్రమించిందా..?' అంటూ మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిపై మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మండిపడ్డారు. 'మానసిక సమస్య ఉంటే చెప్పు.. వైద్యం చేయిస్తా..' అంటూ ఎద్దేవా చేశారు. అనంతపురంలోని తన నివాసంలో పల్లె ఆదివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్‌మోహన్‌రెడ్డిని వదిలి, అభివృద్ధి కోసం కష్టపడుతున్న చంద్రబాబునాయుడుపై విమర్శలు చేయడం ఏంటని మండిపడ్డారు. ప్రశాంతంగా వ్యాపారాలు చూసుకోవాలనీ, వైసీపీ వచ్చేదీలేదు, చచ్చేదీలేదని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పుట్టపర్తి నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి చేశామో వైసీపీ కార్యకర్తలనే అడిగి తెలుసుకోవాలన్నారు. పుట్టపర్తిలో అసాంఘిక కార్యకలాపాలను సహించేదిలేదనీ, ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. 'నీ అవినీతి గురించి చెప్పమంటావా.. సాయిటవర్ నుంచి అంగన్‌వాడీ వర్కర్ పోస్టుల అమ్మకాల వరకు నీ అక్రమాల చిట్టా విప్పాలా' అంటూ ధ్వజమెత్తారు. నోటి దురుసు తగ్గించుకుంటే మంచిదని హితవు పలికారు.

టమోటా కిలో రూ.20

అనంతపురంరూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. సరాసరి రూ.14, కనిష్ఠ రూ.10 ధర పలికిందన్నారు. మొత్తంగా ఆదివారం మార్కెట్‌కు 2,100 వచ్చాయన్నారు.

ఆరిపోయిన దీపాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి..

మరొకరికి తీవ్రగాయాలు

పండగ పూట ఆయా కుటుంబాల్లో విషాదం


అరుణ్‌కుమార్ (ఫైల్)


లక్ష్మణసాయి (ఫైల్)

నల్లమాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వేళ ఆ కుటుంబాల దీపాలు ఆరిపోయాయి. చేతికొచ్చిన కొడుకులు విగత జీవులయ్యారు. రాత్రంతా మిత్రులు సాసవుల చిన్నమ్మ కథ విని ద్విచక్ర వాహనంలో వెళుతూ ప్రమాదంలో మృతి చెందారు. వారి తల్లిదండ్రులకు తీరని విషాదం మిగిలింది. బిడ్డలను చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మాకు దిక్కెవరంటూ గుండెలు బాదుకున్నారు. నల్లమాడ మండలంలోని గోపేపల్లి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా.. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొన్న ప్రమాదంలో నల్లమాడ గ్రామానికి చెందిన లక్ష్మణసాయి(19), అరుణ్‌కుమార్ (19) అక్కడికక్కడే మృతి చెందగా.. చారుపల్లి బన్నీ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. శనివారం రాత్రి నల్లమాడలోని షిర్డిసాయిబాబా ఆలయం వద్ద సాసవుల చిన్నమ్మకథ ప్రదర్శించారు. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల వరకు చిన్నమ్మ కథను తిలకించారు. ముగ్గురు మిత్రుల్లో చారుపల్లి బన్నీ బెంగళూరు వెళ్లాలని చెప్పడంతో.. ఒకే ద్విచక్రవాహనంలో కదిరికి వెళ్లారు. పండుగ పూట ఎందుకు, తర్వాత వెళ్లొచ్చని మిత్రులు చెప్పడంతో బన్నీ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నాడు. ఉదయం 6 గంటల సమయంలో ముగ్గురూ కదిరి వైపు నుంచి ద్విచక్రవాహనంలో నల్లమాడకు బయలుదేరారు. మార్గమధ్యంలో గోపేపల్లి సమీపాన రోడ్డు మలుపులో ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొని రాళ్లపై పడడంతో లక్ష్మణసాయి, అరుణ్‌కుమార్ తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. చారుపల్లి బన్నీ తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. లక్ష్మణసాయి, అరుణ్‌కుమార్, చారుపల్లి బన్నీ చిన్ననాటి నుంచి మంచి స్నేహితులు. వీరంద రి కుటుంబాలు నల్లమాడలోని గంగా థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్నాయి. లక్ష్మణసాయి తండ్రి వెంకటనారాయణ బేల్దారి పనులు చేసుకుంటుండగా, అరుణ్‌కుమార్ తల్లి కుళ్లాయమ్మ కూరగాయల వ్యాపారం చేసుకుంటోంది. అరుణ్‌కుమార్, లక్ష్మణసాయి, బన్నీలు పదో తరగతి వరకు చదువుకున్నారు. బన్నీ ఇటీవల బెంగళూరుకు వెళ్లి ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేసుకుంటున్నాడు. లక్ష్మణసాయి, అరుణ్‌కుమార్ ఇళ్ల వద్దే చిన్న చిన్న పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉన్నారు. బన్నీ మూడు రోజుల క్రితం నల్లమాడకు వచ్చాడు. ఆదివారం బెంగళూరుకు వెళ్లాల్సి ఉంది.. కదిరిలో బస్సు ఎక్కిస్తామని ముగ్గురు కలిసి ఒకే ద్విచక్రవాహనంలో వెళ్లి, ప్రయాణాన్ని రద్దు చేసుకుని తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ నరేంద్రరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పంచనామా కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం లక్ష్మణసాయి మృతదేహాన్ని నల్లమాడకు, అరుణ్‌కుమార్ మృతదేహాన్ని నల్లసింగయ్యగారిపల్లికి తరలించి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వీరు మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో పండుగ పూట తీవ్ర విషాదం నెలకొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఢిల్లీ, ఆంధ్రా మ్యాచ్ డ్రా

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ, ఆంధ్రా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. నాలుగు రోజులుగా స్థానిక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న బీసీసీఐ సీకే నాయుడు అండర్-23 క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌ను ఆంధ్ర జట్టు 181.5 ఓవర్లలో 6 వికెట్లకు 630 పరుగుల వద్ద చేసి డిక్లేర్ చేసింది. ఎస్వీ రాహుల్ (386 బంతుల్లో 18బౌండరీలు, రెండు సిక్సర్లతో 203) డబుల్ సెంచరీ, అభినవ్ (101) సెంచరీతో కదంతొక్కారు. ప్రసాద్ (94), తేజా (76), సాయిశ్రావణ్ (73) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. మొదటి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ జట్టు 126 ఓవర్లలో 394 పరుగులకు ఆలౌటైంది. బ్యాటర్లు దేవ్‌లాక్రా సెంచరీ (158), క్రిష్‌దేవ్ హాఫ్ సెంచరీ (70)తో పర్వాలేదనిపించారు. ఆంధ్రా బౌలర్లు ఆదిత్యరెడ్డి, సాయిశ్రావణ్ చెరో 3, సుమిత్ 2 వికెట్లు పడగొట్టారు.

మైనింగ్ లీజుల్లో రాయితీపై హర్షం

● సీఎం చిత్రపటానికి వడ్డెర్ల క్షీరాభిషేకం



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న వడ్డెర్లు

కొత్తచెరువు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మైనింగ్ లీజులకు సంబంధించి వడ్డెర్లకు రాయితీని కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయంపై వడ్డెర్ల తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నట్టు వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శీన పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీసీకాలనీలో ఆదివారం వడ్డెర్లు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఒలిపి శీన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వడ్డెర్లకు రోడ్డు మెటల్, ఇతర గనుల లీజుల కేటాయింపుపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారన్నారు. దీంతో సీఎం చంద్ర బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చర్చించి వడ్డెర్లకు మైనింగ్ లీజుపై విధివిధానాలను రూపొందించడానికి కమిటీ వేశారన్నారు. దీంతో కులవృత్తులనే నమ్ముకుని బతుకుతన్న తమకు మైనింగ్ లీజుల్లో రాయితీలు తమ జీవన ప్రమాణాలను పెంచుతాయని ఆయన పేర్కొన్నారు.

ఎస్పీ తనిఖీలు



అర్బన్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, ప్రజల భద్రతను పరివేక్షించే క్రమంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఎస్పీ సతీకుమార్ పలు పోలీస్టేషన్లను తనిఖీ చేశారు. పుట్టపర్తి అర్బన్, బుక్కపట్నం, కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌లను, జిల్లా పోలీసు కార్యాలయాలను అకస్మికంగా తనిఖీ చేశారు. రాత్రిపూట గస్తీలు, పెట్రోలింగ్, పోలీసుల తనిఖీలపై పరిశీలించారు. రాత్రి పూట గస్తీలు చేపట్టి ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు.

బేల్దారి ఆత్మహత్య



బేల్దారి రమేష్ (ఫైల్)

ముదిగుబ్బ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నివాసముంటున్న రమేష్ (34) అనే వ్యక్తి ఆదివారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ముదిగుబ్బ పోలీసులు తెలిపారు. ముదిగుబ్బలోని బంగ్లా కాలనీలో నివాసముంటున్న రమేష్ బేల్దారి పని చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని రోజులుగా భార్యభర్త గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో కొన్నిరోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లడంతో తీవ్ర మనోవేదనకు గురైన రమేష్ ఇంట్లో ఇనుప తీరుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కిటికీలో నుంచి గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్‌ఐ నాగభూషణం సంఘటనా స్థలానికి వెళ్లి ఆత్మహత్యకు కారణాలపై ఆరా తీశారు. మృతుడికి ఏడేళ్ల క్రితం వివాహమైందని, భార్య, కొడుకు ఉన్నారని ఏఎస్‌ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పాడి ఆవు మృతి

● సరైన వైద్యం అందకనే..: రైతు ఆవేదన

తనకల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముండ్లవారిపల్లిలో శనివారం రాత్రి సతీష్ అనే రైతుకు చెందిన పాడి ఆవు మృతి చెందింది. రూ.1.20 లక్షల విలువ చేసే తన జీవనోధారమైన పాడి ఆవు పశువైద్యాధికారులు అందుబాటులో లేకపోవడంతో మృతి చెందినట్లు సతీష్ కుటుంబం కంటతడి పెట్టారు. ఆ ఆవు రెండు దూడలకు జన్మనిచ్చిందని, రోజూ ఉదయం, సాయంత్రం 14లీటర్ల పాలు ఇచ్చేదని తెలిపారు. ఉన్నట్లుండి ఆవుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో శనివారం సమీపంలోని తవళం ఆసుపత్రి పశువైద్యాధికారిని సంప్రదించినట్లు తెలిపారు. ఆయన తాను రాకుండా గోపాలమిత్రలను పంపారన్నారు. వారు వైద్యం అందించినా ప్రయోజనం లేదని, ఆవు మృతిచెందిందన్నారు. తమ జీవనాధారామైన ఆవు మృతికి పరోక్షంగా డాక్టర్ కారణమన్నారు. అందుబాటులో లేకుండా గోపాలమిత్రలతో పశువులకు వైద్యం చేయిస్తున్న డాక్టర్లపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ విషయంపై తవళం పశు వైద్యాధికారి డాక్టర్ రవినాయక్‌ను వివరణ కోరగా... తాను శనివారం లీవులో ఉన్నానని తెలిపారు. రైతు సతీష్ ఫోన్ చేస్తే గోపాలమిత్రను పంపి వైద్య సేవలు అందించినట్లు వివరించారు.

నిబంధనలు తప్పక పాటించాలి: డీఎస్పీ



టపాసుల దుకాణదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

ధర్మవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీసుల నిబంధనలు తప్పక పాటించి విక్రయాలు జరపాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ టపాసుల విక్రయదారులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాటుచేసిన ప్రాంతాన్ని ఆయన ఆదివారం తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. దుకాణాల యజమానులకు పలు సూచనలు తెలిపారు. భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

మహిళల భద్రతపై అవగాహన

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కప్పలబండ గ్రామంలో ఆదివారం రాత్రి డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వారధి గ్రామసభ నిర్వహించారు. మహిళలు, ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సైబర్ సేఫ్టీ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు శక్తియాప్, గుడ్‌టచ్‌బ్యాడ్ టచ్ వంటి అంశాలపై డీఎస్పీ అవగాహన కల్పించారు. ఫ్యాక్షన్ గొడవలకు దూరంగా ఉండాలని పిల్లలకు ఉన్నత విద్యను అందించాలని సూచించారు. కొత్తవారు గ్రామంలో కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో ఎస్సై లింగన్న గ్రామస్థులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో అర్చకుడి మృతి

ధర్మవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణవీధిలో నివశిస్తున్న ఎర్రబల్ల విజయ్‌కుమార్‌శర్మ(51) అనే అర్చకుడు ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. పట్టణంలోని ఎస్ఎల్‌వీ మార్కెట్ వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరాలయం, చెరువు కట్ట వద్ద వినాయక ఆలయంలో అర్చకులుగా పనిచేస్తున్నారు. తెల్లవారుజామున ఉన్నపలంగా సుస్తిగా ఉందని కుటుంబసభ్యులకు తెలపడంతో, ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుల సూచనతో అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి గాయత్రి సంఘం, అర్చక సంక్షేమ సంఘం సభ్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుడికి భార్య ఆశ, కుమార్తెలు శ్రేయ, జ్ఞానశ్రీ ఉన్నారు.

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్దేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లేశ్వరస్వామికి, విరూపాక్షి స్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..



పెనుకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భోగసముద్రం చెరువు వద్ద వెలసిన దక్షిణముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పూలతో అలంకరించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి

పెనుకొండ టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మంత్రి సవిత సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. పెనుకొండ, సోమందేపల్లి, పరిగి, రొద్దం, గోరంట్ల మండలాలకు చెందిన 17 మందికి రూ.8,19,149లను చెక్కులు అందించారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

పెనుకొండ రూరల్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరికి చెందిన టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డిని ఆయన గృహంలో మంత్రి సవిత ఆదివారం పరామర్శించారు. లక్ష్మీనారాయణరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న మంత్రి సవిత విచ్చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సింగిల్‌విండో అధ్యక్షులు పోతిరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవయ్య, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, వీజీపాళ్యం శీనా తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

రొళ్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రత్నగిరి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1991, 1995-96 పదవతరగతి పూర్వ విద్యార్థుల ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలు, తీపిగుర్తులను నెమరవేసుకున్నారు. తమకు విద్యనేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం పాఠశాలలో సరస్వతి మాత విగ్రహాన్ని ఆవిష్కరించారు.

'జ్యోతి.. పరబ్రహ్మ స్వరూపం'

- మున్సిపల్ చైర్మన్ రమేష్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రమేష్

హిందూపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జ్యోతి పరబ్రహ్మ స్వరూపమని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ బ్రహ్మకుమారీలు పేర్కొన్నారు. దీపావళి పండగను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో జరిగిన దీపావళి వేడుకలకు మున్సిపల్ చైర్మన్ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ దీపావళి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో రాజమాత బెహన్ సుగంధ, కౌన్సిలర్ అయాబ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యూరియా పంపిణీ

అమరాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సొసైటీలో ఆదివారం 12 టన్నుల స్పీక్‌వేప పిండి, 12.6టన్నుల యూరియా దిగుమతి చేసుకున్నట్లు సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్ తెలిపారు. మంగళవారం నుంచి రైతులకు వ్యవసాయ కార్యాలయంలో వీటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

హాస్యనటుడు బ్రహ్మానందాన్ని కలిసిన న్యాయవాది

పెనుకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మనందాన్ని సాహితీ గగన్నహల్ ట్రస్ట్ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని బ్రహ్మానందం ఇంటికి వెళ్లి ఆయనను కలిసి సన్మానించారు.



బ్రహ్మానందానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

నేతన్నలపై పావగడ యువకుడి సినిమా

పావగడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ధర్మవరం పట్టుచీరలకు సంబంధించి పావగడ తాలూకా తిరుమణి గ్రామానికి చెందిన రాజావెంకటచ్ సినిమా తీశారు. ధర్మవరం పేరు మీద తీసిన సినిమాకు సంబంధించి ఆదివారం టీజర్లు పావగడలో విడుదల చేశారు. బళ్లారి రోడ్డులోని రామాంజనేయ వేబ్రిడ్జి దగ్గర సినిమా టీజర్లు ప్రదర్శించారు. ఈనెల 24న ప్రపంచవ్యాప్తంగా 200 కేంద్రాల్లో సినామాను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. యూనిట్ సభ్యులు మానం వెంకటస్వామి, సొగుడు వెంకటేశ్, మైలారరెడ్డి, బాలు, హనుమంతరెడ్డి, చిత్ర, నిర్మాతలు రోహిత్, వెంకటేశ్‌రెడ్డి, నెరమట్లు, పెద్దన్న తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



టీజర్ లాంచ్‌లో పాల్గొన్న ధర్మవరం సినిమా సభ్యులు

వక్కచెట్లను నరికిన దుండగులు



వక్కతోటను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

రొళ్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమంతనపల్లి గ్రామంలో రైతు రంగనాథ్‌కు చెందిన వంద వక్కచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేసిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న వక్కళిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఏపీఐఐసీ డైరెక్టర్ రామక్రిష్ణ, సింగిల్‌విండో అధ్యక్షులు దాసిరెడ్డి, మండల కన్వీనర్ ఈరన్న ఆదివారం పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ దుశ్చర్యకు పాల్పడిన ఎంతటివారైనా ఉపేక్షించేంది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

శివాలయానికి విరాళం

హిందూపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తకాపులపల్లిలో నిర్మిస్తున్న శివాలయానికి రాష్ట్ర రోడ్డు అభివృద్ధి డైరెక్టర్ చంద్రమోహన్‌యాదవ్ రూ.20వేలు విరాళం అందజేశారు. అదేవిధంగా ఆలయాభివృద్ధికి మరింత సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

జింక మృతి

చిలమత్తూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు పుట్టపర్తి జాతీయ రహదారిలో ముద్దపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జింక మృతి చెందింది. శనివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు ఆదివారం ఉదయం మృతిచెందిన జింకను గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

ఘన నివాళి

చిలమత్తూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ గాడ్రాళ్లపల్లి గంగప్పకు టీడీపీ నాయకులు ఘన నివాళి సమర్పించారు. గంగప్ప శనివారం రాత్రి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్, మండల కన్వీనర్ శ్రీనివాసులు ఆదివారం ఉదయం గాడ్రాళ్లపల్లికి చేరుకొని మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కాగా గంగప్ప మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలకృష్ణ ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని గంగప్ప కుమారుడు వెంకటేశు తెలిపారు.